సాక్షి
కర్నూలు

సోమవారం : 19 : ఫిబ్రవరి : 2024

జన సునామీ





రాప్తాడు వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- దద్దరిల్లిన రాప్తాడు
- సీమవాసుల సమరోత్సాహం
- మార్మోగిన జగన్నినాదం
- అడుగడుగునా నీరాజనం
- అంచనాలకు మించి తరలివచ్చిన జనం
- సీఎంతో జతకలిసిన లక్షలాది గొంతుకలు
- ఎన్నికలకు 'సిద్ధ'మని ఆకాశాన్నంటేలా గళం
- 'వై నాట్ 175' అని నినదించిన వైనం
- 'సిద్ధం' సభ విజయవంతం

రాప్తాడులో జన సునామీ ఎగసిపడింది. సంక్షేమ ప్రదాతను చూసి ఉప్పొంగి పోయింది. అభిమాన నాయకుడితో జతకలిసింది. జయహో జగన్ అంటూ మార్మోగించింది. మా నమ్మకం నువ్వేనంటూ హోరెత్తించింది. ప్రతిపక్షాలకు వణుకు పుట్టించేలా రణ నినాదం చేసింది. వై నాట్ 175 అంటూ నలుదిక్కులా నినదించింది. పెత్తందారులతో పోరుకు 'సిద్ధం' అని ప్రకటించింది. ప్రతిపక్షాల నక్కజిత్తులను చిత్తు చేస్తామని స్పష్టం చేసింది. వైఎస్సార్ సీపీ శ్రేణులను సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.



ఆనందం: మనవడిని చూసి చేయి ఊపుతూ మద్దతు తెలుపుతున్న వృద్ధురాలు

అనంతపురం: ప్రతి పేద బాగుండాలని పరితపించారాయన. ఎక్కడా అవినీతికి తావులేకుండా ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేశారాయన. పార్టీలు, కులాలు, మతాలు అనే తేడా లేకుండా కోట్లాది మందికి మేలు చేకూర్చాయన. మరి అలాంటి వ్యక్తి స్వయంగా తమ ప్రాంతానికే వస్తే ఇంకేమైనా ఉందా. అభిమానం తరంగమైపోదూ! సరిగ్గా అదే జరిగింది. సార్వత్రిక ఎన్నికలకు సమరశంఖం మోగిస్తూ రాప్తాడులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అతి పెద్ద ప్రజా సభకు రాప్తాడు వేదికైంది. సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు పార్టీ శ్రేణులే కాకుండా జనం భారీగా తరలివచ్చారు. సునామీని తలపించారు. అంతులేని అభిమానాన్ని చాటారు. తండోపతండాలుగా వచ్చిన జనసందోహంతో సభా స్థలం కిక్కిరిసిపోయింది. ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు ఇంత పెద్ద స్థాయిలో జనం పోటెత్తడం బహుశా ఇదే ప్రథమం!

మండుటెండను సైతం లెక్కచేయకుండా..

రాయలసీమ పరిధిలోని 52 అసెంబ్లీ నియోజకవర్గాలు, 7 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి వందలాది బస్సులు, వేలాది వాహనాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అభిమాన నేత రాక కోసం ఎదురు చూశారు. 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా స్థలం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకే జనంతో నిండిపోయింది. దీంతో చాలామంది జాతీయ రహదారిపై నిల్చునే సీఎం ప్రసంగాన్ని విన్నారు. వచ్చిన వారికి అసౌకర్యం కలగకుండా గ్యాలరీల వద్ద చల్లని మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచారు.

నడిచొచ్చి.. ఉత్సాహం నింపి

మధ్యాహ్నం 3.40 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం జగన్ వేదికపై ఉన్న నాయకులను పేరుపేరునా పలకరించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా స్థలం మొత్తం కవర్ చేస్తూ ఫ్యాన్ ఆకారంలో ఏర్పాటు చేసిన వాక్ వే వద్దకు చేరుకున్నారు. 10 నిమిషాల పాటు ప్రజలందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగి ఉత్సాహం నింపారు. అభిమాన నేతను దగ్గర నుంచి చూసిన పార్టీ శ్రేణులు మురిసిపోయాయి.



మీరే నా సైన్యం: ప్రజలకు అభివాదం చేసుకుంటూ వాక్‌వేపై వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పంచ్ డైలాగ్‌లతో దద్దరిల్లిన సభ

సీఎం జగన్ తన ప్రసంగంతో శ్రేణులను హోరెత్తించారు. దాదాపు 75 నిమిషాల పాటు ప్రసంగించిన ఆయన.. గత 57 నెలల్లో పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలను వివరించారు. మధ్యమధ్యలో పదునైన పంచ్ డైలాగ్‌లతో అందరినీ ఆకట్టుకున్నారు. 'విశ్వసనీయతకు, వంచనకు మధ్య జరుగుతున్న యుద్ధం.. 'సీమ'లో సముద్రం లేకపోవచ్చు.. కానీ నేడు రాప్తాడులో జన సముద్రం చూడొచ్చు.. ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లో తిరుగుతూ ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయట ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లో ఉండాలి'' అంటూ ఆయన పేల్చిన పంచ్ డైలాగ్‌లకు లక్షలాది గొంతుకలు అనుకూలంగా ప్రతిధ్వనించాయి. ''చొక్కా మడతేసి.. బాబు కుర్చీని సైతం మడతేసి చీపురుతో ఊడ్చి వాళ్ల పార్టీని మడతేయడానికి సిద్ధంగా ఉన్నారా?' అని సీఎం జగన్ అన్నప్పుడు 'మేమూ సిద్ధమే' అంటూ గొంతెత్తారు. ముఖ్యమంత్రి ప్రసంగించినంత సేపూ ఈలలు, చప్పట్లతో మద్దతు పలికారు. 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మంచి చేయకపోగా అవినీతి, అభూత కల్పనలతో పాలన సాగించారని విమర్శించినపుడు 'నిజం' అంటూ ప్రజలు మద్దతు తెలిపారు. పెత్తందార్లు, పేద వారికి మధ్య జరిగే యుద్ధానికి 'సిద్ధమా' అని సీఎం జగన్ అన్నప్పుడు 'సిద్ధం' అంటూ నినదించారు.



ఒకటే లక్ష్యం : సభా స్థలం కిక్కిరిసిపోవడంతో రహదారిపైనే నిల్చుని సీఎం ప్రసంగం వింటున్న జనం





మేమూ నీవెంటే: ముఖ్యమంత్రిని చూసిన ఉత్సాహంలో వృద్ధులు

- అభిమాన నేతను చూసేందుకు జనం ఎగబడటంతో పలు బారికేడ్లు పడిపోయాయి. పోలీసులు వారిని అదుపుచేయడం కత్తిమీద సాములా మారింది. ఇంకొంతమంది అయితే సీఎంను చూసేందుకు లైట్లు, స్పీకర్ల స్టాండ్లు ఎక్కారు. మరికొందరు బ్యానర్లు కట్టిన కట్టెల సాయంతో పైకి ఎక్కి ముఖ్యమంత్రిని చూసి మురిసిపోయారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

'సిద్ధం'ను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువకులు తీన్‌మార్ నృత్యాలతో ఆకట్టుకున్నారు. సీఎం జగన్ పాలనలో జరిగిన రాష్ట్రాభివృద్ధిని ప్రముఖ కళాకారులు కళ్లకు కట్టారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు నారాయణస్వామి, అంజాద్ బాషా, ఉషశ్రీ చరణ్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాలగుండ్ల శంకర్‌నారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే అన్నా: కటౌట్ పట్టుకుని జగన్నినాదం చేస్తున్న యువతి



నాన్న స్మృతిలో : వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్



కదిలింది జన కదలి : రాయలసీమ నలువైపుల నుంచి తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా...

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడు 'సిద్ధం' సభలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఇలా సాగింది. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు హెలికాప్టర్ రాప్తాడు సమీపంలోని సభా వేదిక వద్దకు వచ్చింది. వేదిక చుట్టూ ఒక రౌండు తిరిగిన అనంతరం 3.35 గంటలకు కిందకు దిగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3.50 గంటలకు సభ వేదికపైకి వచ్చారు. వేదికపై కూర్చున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఒక్కొక్కరినీ పలకరించారు. 3.55 గంటలకు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదికపై నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేశారు. సాయంత్రం 4.10 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభమైంది. 5.20 గంటలకు ప్రసంగం ముగించారు.



సై : సమరానికి సిద్ధమంటున్న అభిమాని

క్లుప్తంగా

108లో గర్భిణి ప్రసవం

• తల్లీబిడ్డ క్షేమం


శిశువుతో 108 అంబులెన్స్ సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామానికి చెందిన బోయ నిర్మల 108లో బిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం తెల్లవారు జామున నిర్మలకు పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త ఆనందమ్మ వెంటనే 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు. హొళగుంద పీహెచ్‌సీకి చెందిన 108 అంబులెన్స్ కోగిలతోట గ్రామానికి చేరుకుని గర్భిణిని బళ్లారి గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మాటసూగూరు గ్రామ మధ్యలో నొప్పులు తీవ్రమైయ్యాయి. దీంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎమ్టీ) బీ కె.యల్లయ్య, పైలెట్ వినోద్‌కుమార్ సహకారంతో నిర్మలకు చికిత్స అందించగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈఎమ్టీ యల్లయ్య మాట్లాడుతూ.. 108లో ఇప్పటి వరకు 35 వరకు కాన్పులు చేసినట్లు చెప్పారు.

గుర్తుతెలియని శివస్వామి మృతి



కర్నూలు: గుర్తు తెలియని శివస్వామి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. సుమారు 60 సంవత్సరాల వయస్సు, తెల్లని జుట్టు, గడ్డం, 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ కలిగి ఉంటాడు. కర్నూలు శివారులోని వెంగన్నబావి సమీపంలో శివాలయం దగ్గర నాలుగు రోజుల నుండి శివ స్వాములు పెట్టిన ప్రసాదం తింటూ అక్కడే ఉండేవాడు. 13వ తేదీ రాత్రి స్పృహ తప్పి పడిపోవడంతో పక్కనే ఉన్న శివస్వామి నవీన్‌కుమార్ 108 అంబులెన్స్‌కు పిలిపించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక 17వ తేదీ రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తాలూకా పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101064కు సమాచారం అందించాలని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెకు చెందిన బోయ నారాయణ (71) ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నారాయణకు భార్య, పిల్లలు లేక పోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయి ఆదివారం రసాయన ద్రావణాన్ని తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఎం.రాజారామ్ కుటుంబ సమేతంగా రూ.1,00,116 విరాళాన్ని ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.

జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నంద్యాల జిల్లా క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి మహిళా, పురుషుల హ్యాండ్ బాల్ జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రాజ్‌కుమార్‌రెడ్డి మహబూబ్ బాషా, సుధాకర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 60 మంది క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ నెల 19 నుంచి మహిళా హ్యాండ్ బాల్ జట్టు శిక్షణ శిబిరం రుద్రవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 వరకు శిక్షణ ఇస్తున్నామన్నారు.


పూజలందుకుంటున్న సిద్ధేశ్వరస్వామి


అశేష భక్తజనం మధ్య సిద్ధేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

సిద్ధేశ్వరుడికి నీరాజనం

• హొళగుందలో ఘనంగా రథోత్సవం

హొళగుంద: సిద్ధేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం రాత్రి హొళగుందలో కనుల పండువగా జరిగింది. ముందుగా ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళహారతి, నైవేద్య సమర్పణ అనంతరం పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఎదురు బసవన్నగుడి చుట్టూ ఊరేగించారు. కొందరు భక్తులు ఆచారం ప్రకారం కుంభంతో వచ్చారు. మరి కొందరు భారీ గజమాలలను ట్రాక్టర్‌లో తెచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి అశేష భక్త జనుల జయజయ ధ్వానాల మధ్య అత్యంత వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజపంపన్నగౌడ్ ఆధ్వర్యంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


రథోత్సవానికి ముందు ఆలయానికి కుంభం తెస్తున్న భక్తులు

నేడు లంకాదహనం

జాతరలో భాగంగా సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం లంకాదహనం కార్యక్రమం జరగనుంది. అంతకు ముందు చిన్నారుల కోలాటాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. మంగళవారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.


సీడీ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన

పాటల సీడీ ఆవిష్కరణ

డోన్‌టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రముఖ జానపద గీతాల చెక్క భజన గురూజీ రాంపల్లె శ్రీను పాటల రూపంలో రచన చేసి స్వయంగా గానం చేసిన ఆడియో సీడీలను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక మంత్రి స్వగృహంలో ఆదివారం వైఎస్ఆర్ అభిమాని చెక్క భజన గురూజీ రాంపల్లె శ్రీనును, ఇందుకు తోడ్పాటునందించిన కౌన్సిలర్ ఆర్జ్ రమణను మంత్రి సన్మానించి సీడీ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పాటలను పార్టీ శ్రేణులు జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొత్రాయి తిరుమల రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు న్యాయవాది నాగభూషణంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐడీడీఎం రేపు జాతికి అంకితం

• వర్చువల్‌గా హాజరుకానున్న ప్రధాన మంత్రి, సీఎంలు


ట్రిపుల్‌ఐటీ డీఎం

కర్నూలు సిటీ: కర్నూలు శివారులోని జగన్నాథగట్టులో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ డీఎం) క్యాంపస్‌ను రేపు(మంగళవారం) దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా జాతికి అంకితం చేయనున్నారు. విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా 2014 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ ప్రకారం ఏపీ పునర్విభజన చట్టం-2014 లో భాగంగా ట్రిపుల్‌ఐటీ డీఎంను నిర్మించారు. భారత ఐటీ పరిశ్రమను బలోపేతం చేయడంలో , దేశీయ ఐటీ మార్కెట్ వృద్ధిని నిర్ధారించడంలో ఈ సంస్థ సహాయం చేసేలా నెలకొల్పారు. మొదటగా ట్రిపుల్ ఐటీ డీఎం కాంచీపురం(తమిళనాడు) మెంటర్ ఇనిస్టిట్యూట్‌గా 2015 ఆగస్టులో కాంచీపురం క్యాంపస్‌లో మూడు బీటెక్ కోర్సులతో తరగతులు మొదలయ్యాయి. ఆ తరువాత మరో కోర్సుతో కలిపి మొత్తం నాలుగు కోర్సులతో కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై 152 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభమైంది. మొత్తం 11 భవనాలు, మూడు సెమినార్ హాల్స్, ఒక మల్టిపర్పస్ హాల్ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. క్యాంపస్ జాతికి అంకితం చేసే కార్యక్రమంలో వర్చువల్‌గా ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్, ట్రిపుల్‌ఐటీ డీఎం కర్నూలు చైర్మన్ ఆచార్య హెచ్‌ఏ రంగనాథ్, డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు పాల్గొననున్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్ జాగ్రత్త

• జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి



బొమ్మలసత్రం: ప్రస్తుతం టెక్నాలజీ రంగం దూసుకుపోతున్న సందర్భంలో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మట్లాడుతూ గుర్తుతెలియని మొబైల్ నంబర్స్ నుంచి ఫోన్ చేసి 'మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయిందని, మీ పాన్‌కార్డు నంబర్, ఆధార్ నంబర్ అప్‌డేట్ చేసుకొనేందుకు ఈ లింక్ క్లిక్ చేయండి' అని వచ్చే సందేశాలను నమ్మవద్దని సూచించారు. ఫ్రీ గిఫ్ట్, లోన్ యాప్.. అంటూ వచ్చే మెసేజ్‌లో ఉన్న లింక్ ని క్లిక్ చేసి బ్యాంకు ఖాతా నంబర్లు, పాన్ వార్డులు, ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలోని సొమ్మును కాజేస్తారన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు తెలుసుకునేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోతుందన్నారు. అంతే కాకుండా వ్యక్తిగత సమాచారం వారివద్ద భద్రపరుచుకొని ఇతర నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. తెలియని మొబైల్ నంబర్ల నుంచి వచ్చే లింక్‌లను ఎట్టిపరిస్థితులలో క్లిక్ చెయ్యవద్దన్నారు. అపరిచితులతో ఎవరితోనూ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు.

నేటి పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. అర్జీదారులు ఈ విషయం గమనించి జిల్లా పోలీసు కార్యాలయానికి రావొద్దని సూచించారు. జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్‌లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాలలో పోలీసు స్పందన కార్యాక్రమం యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని సమస్యల గురించి ఆయా పోలీస్‌స్టేషన్లలో వినతులు సమర్పించవచ్చన్నారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

కర్నూలు(అగ్రికల్చర్): నెల్లూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ వెలుగు చూడటంతో పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఏరియా హాస్పిటల్స్ వారీగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ టీమ్‌లో ఒక వెటర్నరీ అసిస్టెంటు సర్జన్, పారా సిబ్బంది ఉంటారు. ఎక్కడైన బర్డ్‌ఫ్లూ అనుమానాస్పద కేసులు వెలుగు చూస్తే వెంటనే ఈ టీమ్ స్పందిస్తుంది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో కోళ్ల దాదాపు 14 లక్షల వరకు ఉన్నాయి. బర్డ్ ఫ్లూపై కోళ్ల ఫారం యజమానులకు వెటర్నరీ డాక్టర్లు, పారా సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. బయో సెక్యూరిటీ పద్ధతుల గురించి వివరించనున్నారు. ఎక్కడైనా సాధారణం కంటే ఎక్కువగా కోళ్ల మరణాలు ఉంటే వెంటనే ఈ సమాచారాన్ని సంబంధిత పశువైద్యుల దృష్టికి తీసుకెళ్లాలని కర్నూలు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రామచంద్రయ్య, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు సూచించారు.

నెల్లూరు నుంచి కోళ్లు, గుడ్ల దిగుమతిపై నిషేధం

బర్డ్‌ఫ్లూ గిన్ని కోళ్లు, టర్కీ కోళ్లు, నీటి పక్షులు, బాతులు, కొంగలు, కౌజు పిట్టలు, వన్యపక్షులు, నెమళ్లు, విదేశీ పక్షుల ద్వారా వ్యాప్తించవచ్చు. వ్యాధి నిర్ధారణ అయినందున నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, గుడ్లు, దాణా తదితర వాటిని దిగుమతి చేసుకోవడంపై నిషేధం విధించారు. రిజర్వాయర్లు, చెరువులకు సమీపంలో ఉన్న కోళ్ల ఫారాల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ప్రధానంగా మిడుతూరు మండలం రోళ్లపాడు పక్షుల కేంద్రంపై కూడా నిఘా పెంచనున్నారు. ఈ ప్రదేశాలకు వలస పక్షులు వచ్చే ప్రమాదం ఉంది. ఇటువంటి ప్రదేశాల్లోని ఫారాల్లోని కోళ్ల నుంచి రక్త నమూనాలు, ముక్కు, నోటి నుంచి ద్రవాల శ్యాంపుల్స్ సేకరించి విజయవాడ, బెంగళూరు ల్యాబ్‌లకు పంపే విధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. బర్డ్‌ఫ్లూ వ్యాధి వెలుగు చూసిన నేపథ్యంలో గుడ్లు, కోడి మాంసంను అధిక ఉష్ణోగ్రత వద్ద (70 డిగ్రీ సెంటిగ్రేడ్) ఉడకబెట్టడం వల్ల వైరస్ క్రిములు చనిపోతాయి.

లక్షణాలు ఇవీ..

కోళ్లలో ముక్కు, కళ్ల వెంబడి నీరు కారడం, మెడ వాల్చడం, నీరసంగా ఉండడం, కాళ్లు శరీర భాగాలపై మచ్చలు ఏర్పడటం, తలపై భాగంలో ఉండే వాటిల్స్ ఉబ్బడం, దానిపై మచ్చలు ఏర్పడటం గమనించవచ్చు. లేయర్స్‌లో గుడ్ల శాతం ఒక్కసారిగా తగ్గిపోతుంది. ఈ వ్యాధి తీవ్రత మరి ఎక్కువగా ఉన్నప్పుడు 24-48 గంటలలో ఎక్కువ శాతం కోళ్లు మృత్యువాత పడతాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

ఫామ్‌లో కోళ్లకు రోగం వస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలి. పెరటి కోళ్ల మరణాలు ఎక్కువ శాతం ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న పశువైద్య అధికారులను సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణకు, నియంత్రణకు వీలయినంత త్వరగా చర్యలు చేపట్టాలి.

నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు


సారాతో పాటు తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు

కర్నూలు : కర్నూలు బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు దాడులు నిర్వహించారు. కాలనీ వెనుకభాగాన కేసీ కెనాల్ గట్టుపై నీలిషికారీలు బట్టీలు ఏర్పాటు చేసి సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో కర్నూలు సెబ్ సీఐ కేఆర్ రాఘవేంద్రప్రసాద్, ఎస్‌ఐలు మారుతి ప్రసాద్, వీరస్వామి, రాజశేఖర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సిబ్బంది ఆదివారం కాలనీకి చేరుకుని కేసీ కెనాల్ గట్టు వెంట విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసి 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయిస్తున్న నీలిషికారీ మధు వద్ద నుంచి 30 లీటర్లు, షికారీ లక్ష్మీ వద్ద నుంచి 25 లీటర్లు సారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సెబ్, డీటీఎఫ్, ఇంటెలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వినూత్న తరహాలో సోమవారం 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనిదినాలు 150కి పెంపు

• జిల్లాలో 90 వేల కుటుంబాలకు ప్రయోజనం

కర్నూలు(అగ్రికల్చర్): కూలీలకు ఉపశమనం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి పనిదినాలను 150 రోజులకు పెంచింది. దీంతో జిల్లాలో 90 వేల కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రకారం కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తారు. ఈ సారి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో జిల్లాలో 24 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపాధి పని దినాలను కూడ 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచారు. ఇప్పటికే జిల్లాలో 12,000 కుటుంబాలు 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. మరో 75 వేల కుటుంబాలు 50 రోజుల నుంచి 99 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. పని దినాలు మరో 50కి పెంచడం వల్ల ఈ కుటుంబాలన్నిటికీ మేలు జరుగుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు తెలిపారు.

మద్దిలేటి స్వామి గర్భాలయ ద్వారానికి వెండి కవచం


ద్వారానికి వెండి కవచం అమర్చిన దృశ్యం

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహ స్వామి గర్భాలయ ద్వారానికి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఎక్స్‌ఎమ్మార్ బోర్‌వెల్ అధినేత మద్దిలేటిరెడ్డి 47 కేజీల వెండి కవచాన్ని చేయించారు. నూతన గర్భాలయంలోని ద్వారానికి వెండి కవచంపై స్వామి వారి దశ అవతారాలైన మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ స్వామి, వామన, పరశురామ, రామ, బలరామ, బుద్ధ, కల్కి అతరాలతో పాటు ద్వార పాలకులైన జయ, విజేయులు, అమ్మవారి గజలక్ష్మి రూపాలు ఉండటంతో ప్రత్యేక ఆకర్షణగా ఉంది.

పార్వేట పల్లకీకి స్వాగతం


చందలూరుకు చేరుకున్న పల్లకీ

రుద్రవరం: తన వివాహ మహోత్సవానికి భక్తజనాన్ని ఆహ్వానించేందుకు పల్లకీలో బయలుదేరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామికి ఊరూరా భక్తులు నీరాజనం పలుకుతున్నారు. గ్రామానికి పల్లకీ చేరుకోగానే గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎదురేగివెళ్లి పూజలు చేసి స్వాగతిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం పార్వేట ఉత్సవమూర్తుల పల్లకీ నక్కలదిన్నె నుంచి చందలూరుకు చేరుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పార్వేట పల్లకీ గ్రామంలోని పలు తెలుపుల మీద కొలువుదీరగా ఆయా కాలనీ వాసులు పూజలు చేసి స్వామి వార్లను దర్శించుకున్నారు.

అటవీ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

వెలుగోడు: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వెలుగోడు రేంజ్ పరిధిలోని ఇద్దరు అటవీ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఆత్మకూరు డీఎఫ్‌వో అలెన్ చాంగ్ టెరాన్ ఆదేశాల మేరకు వెలుగోడు రేంజ్ పరిధిలోని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జయరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఈదన్నలను సస్పెండ్ చేసినట్లు వెలుగోడు రేంజ్ ఆఫీసర్ ఎంఏ ఖాన్ తెలిపారు. జయరాజు, ఈదన్న విధుల్లో ఉంటూ మద్యం సేవించి చిందులు వేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వీటిని పరిశీలించిన డీఎఫ్‌వో ఆ ఇద్దరిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు రేంజర్ చెప్పారు. విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 64 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు ఆదివారం 64 మంది గైర్హాజరయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 1,757 మందికిగాను 1723 మంది హాజరై, 34 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు 1.596 మందికిగాను 1566 మందికి హాజరై, 30 మంది గైర్హాజరయ్యారు.

మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించండి

• రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ


సమీక్ష నిర్వహిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 21వ తేదీన మహాకుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఆదివారం శ్రీశైలంలోని భ్రమరాంబా అతిథి గృహంలో దేవస్థాన ఈఓ, అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహాకుంభాభిషేక మహోత్సవంలో స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరిపించాలన్నారు. సమయ పాలనతో ఆయా వైదిక కార్యక్రమాలను నిర్వహించాని సూచించారు. అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలతో పకడ్బందీగా ఆయా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా ఆలయంలోని గర్భాలయ విమానాలకు, ఆలయ గోపురాలకు, ఉపాలయాల గోపురాలకు, పంచమఠాలకు ఏర్పాటు చేసిన పరంజాలు ధృడంగా ఉండేవిధంగా చూసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు ఎటువంటి లోపాలు లేకుండా ఆయా ఏర్పాట్లను పరిశీలించి కుంభాభిషేక మహోత్సవాన్ని జరిపించాలని సూచించారు. మహాకుంభాభిషేకాన్ని భక్తులు తిలకించే వీలుగా క్షేత్రపరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, శ్రీశైల టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. బ్రహ్మోత్సవాలపై దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, మండల తహసీల్దార్ సి.గుర్రప్ప, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, సీఐ ప్రసాద్, దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాగ సహాయ సహకారాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశించారు. ప్రతి భక్తుడు కూడా స్వామిఅమ్మవార్లను సౌకర్యవంతంగా దర్శించుకుని, క్షేమంగా ఇంటికి తిరిగి వెళేలా ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, మంచినీటి సరఫరా, క్యూలైన్ల నిర్వహణ, శివదీక్షా భక్తుల జ్యోతిర్ముడి సమర్పణ ఏర్పాట్లు, ఆరుబయలు ప్రదేశాలలో విద్యుద్దీకరణ ఏర్పాట్లు, తాత్కాలిక శౌచాలయాలు, పాతాళగంగలో పుణ్యస్నానాలు, కేశఖండన సమర్పణ ఏర్పాట్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.